క్లుప్తంగా

కంటివైద్యాధికారిగా పరశురామ్

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటివైద్య విభాగం అధికారిగా డాక్టర్ పరశురామ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కంటివైద్యులు కే.అర్జున్‌రెడ్డి రామసముద్రం పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కలకడ మండలం ఎర్రకోటపల్లెలో పనిచేస్తున్న పరశురామ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తానని అన్నారు.

ఎంపీడీఓగా నారాయణస్వామి



రామసముద్రం: రామసముద్రం ఎంపీడీఓగా నారాయణ స్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో అనంతపురంలో విధుల నిర్వహిస్తూ బదిలీపై రామసముద్రంకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన నాగరాజు (51), ఉమాదేవి(28) స్కూటీలో నాలుగు బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తుండగా మండలంలోని దేవులచెరువు సమీపంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో 384 ప్యాకెట్ల మద్యం, స్కూటీ , ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం

బి.కొత్తకోట: అర్హత ఉన్న ప్రతి నేతన్నకు నేతన్న నేస్తం అందేలా చూడాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ అధికారులకు సూచించారు. సోమవారం చేనేత అధికారి వెంకటకుమార్‌తో కలసి బి.కొత్తకోటలో చేనేత మగ్గాలను పరిశీలించారు. అనంతరం నేతన్నలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చొరవతో బి.కొత్తకోట కేంద్రంగా చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 90 శాతం సబ్సిడీతో నేతన్నలకు మగ్గాల పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకుని నేతన్నలు జీవితాలను, జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని కోరారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయండి

ములకలచెరువు: ప్రతి పల్లెలో శ్మశాన వాటికల కోసం స్థలం కేటాయించి మంచినీటి సౌకర్యం , రోడ్లు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ హరికి వినతి పత్రం అందేశారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీటీ వారికి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనంద్, నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి

కలికిరి: మండలంలో బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ కె.రహీముల్లా అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఇతర మతస్తులను కించపరచరాదన్నారు. ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ముస్లిం మతపెద్దలు మంగళవారం మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని తహసీల్దారు భాగ్యలత తెలిపారు. బక్రీద్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళలు పారిశ్రామికంగా ముందుండాలి

తంబళ్లపల్లె: వైఎస్సార్‌క్రాంతిపథం మహిళా సంఘం సభ్యులు పారిశ్రామికంగా ముందుండాలని డీపీఎం ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈస్ట్‌పేట ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం తంబళ్లపల్లె వీవో–4 జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు సద్వియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వం పారిశ్రామిక రంగంలోనూ తోడ్పాటు ఇచ్చేందుకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్టాండప్ ఇండియా, ముద్ర రుణాలను ఎలాంటి షూరిటీ లేకుండా సుమారు రూ.10లక్షల మేరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఆసక్తిగల మహిళ సభ్యులు స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో ముందడుగు వేయాలన్నారు. సమావేశంలో సర్పంచు నీలూఫర్, వీవో అధ్యక్షురాలు నౌషిరా, సీసీ భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం
- సచివాలయ వ్యవస్థతో సత్వర సేవలు
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సరిమడుగులో ప్రజల సమస్యలను తెలుసుకొంటున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం మండలంలోని సరిమడుగు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై స్పందించి అప్పటికప్పుడు పరిష్కారం చూపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న నవరత్నాలను దేశంలోని ఎన్నో రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొంటున్నాయన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక పార్టీలకతీతంగా జరుగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామీణ ప్రజలకు సత్వర సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకొని జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

సరిమడుగు సమస్యలన్నీ పరిష్కరిస్తాం:
మండలంలోని సరిమడుగు సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎగువ సరిమడుగు కొత్తకాలనీలో తాగునీటి సౌకర్యం, విద్యుత్, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు వేయించాలని మహిళలు కోరారు. ఇదే గ్రామంలో కృష్ణమందిరం వరకు సీసీ రోడ్డు వేయాలన్నారు. గ్రామంలో మురుగునీటి కాలువలు నిర్మించాలని కోరారు. గ్రామంలోని కలకడ– గుర్రంకొండ మార్గం నుంచి జీవన్ తోపు వరకు పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. గ్రామంలో ఏడాదిగా లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉందని వెంటనే భర్తీ చేయాలన్నారు. క్రిష్టాపురంలో దిగువ వీధిలో సిమెంటురోడ్లు, తాగునీటిపైపులైన్ల ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. సుబ్బిరెడ్డిగారిపల్లె నుంచి గుండ్లగుట్ట తండాకు మధ్యలో చెరువులో రోడ్డు వేశారని, చెరువు నిండితే రోడ్డు మొత్తం నీట మునుగుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. గుండ్లగుట్టతండాలకు వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. కార్యక్రమంలో ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ కలీమ్, జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర, ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడు నారద రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీరమణ, మాజీ ఎంపీపీ నక్కాచంద్రశేఖర్, హౌస్‌ఫెడ్ చైర్మన్ నక్కాగోపి, సర్పంచ్‌లు గోపాల్‌నాయుడు, మస్తాన్‌రెడ్డి, సింగంశెట్టి రెడ్డికుమార్, జగన్మోహన్, ఎంపీటీసీలు రాజగోపాల్, యాకూబ్, సరస్వతీ, నక్కామధుసూధన్ పాల్గొన్నారు.

కనుల పండువగా ద్రౌపది కల్యాణం



ద్రౌపది కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపది కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ద్రౌపది సమేత ధర్మారాజు, భీమ, అర్జున, నకుల, సహదేవుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు మహాభారత యజ్ఞం వద్దకు తీసుకొచ్చారు. వధూవరుల అలంకరణలు చేపట్టి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ద్రౌపది కల్యాణం నిర్వహించారు. ద్రౌపది కల్యాణోత్సవానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సుభిక్షం కోసం మహాభారత యజ్ఞం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, గజ్జెల శీన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకొండారెడ్డి, వెంకటసిద్దులు, రాజన్న, మోహన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

వాల్మీకిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల సచివాలయ కన్వీనర్ రాయుడు అన్నారు. సోమవారం మండలంలోని మూరేవాండ్లపల్లి సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై ప్రభుత్వ పథకాలు రాని వారిని గుర్తించి, వెంటనే అర్హతను బట్టి ఆయా పథకాలను వర్తింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, రెడ్డెప్ప రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

కలికిరి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకంపై సోమవారం మండలంలో ఎంఎల్‌ఓ జాకీర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని మహల్, అద్దవారిపల్లి, గుండ్లూరు, పల్లవోలు, చీకటిపల్లి, మునెళ్ళపల్లి, మేడికుర్తి, మర్రికుంటపల్లి, కలికిరి–4 గ్రామ సచివాలయాల్లో ఆయా వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గృహసారధులకు జగనన్న సురక్ష అమలుపై అవగాహన కల్పించారు. వలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు అవలంభించాల్సిన విధివిదాలపై తెలియజేశారు. కార్యక్రమాలలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగవేణి, గంగయ్య, బేబి ఆయేషా, ఎంపీటీసీ సభ్యులు అల్లాబక్సు, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పీలేరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కలకడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు : మత్తు పదార్థాలు తయారీ చేయడం, సేవించడం మానుకుని తమ జీవితాలు సరిదిద్దుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పీలేరు పట్టణంలో ప్రపంచమాదక ద్రవ్యాల దుర్వినియోగం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీ పూర్తిగా మనుకోవాలన్నారు. సారా సేవించడం ద్వారా అనారోగ్యానికి గురై కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని తెలిపారు. సారా తయారీ చేయడం మానుకుని జీవితాలు సరిదిద్దుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అలాగే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ గురుప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు బోదేషావలి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..
కలకడ : మత్తుపదార్థాలు వినియోగించడం ద్వారా అనారోగ్యంతో పాటు వాటికి బానిసలుగా మారుతారని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా గుర్రంకొండ–కృషి సంస్థ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కృషి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ వెంకటేశు, సిబ్బంది హాజిరా, జగదీష్, చంద్రనాగమ్మ, రెడ్డిపద్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలని వినతి

కలకడ : అన్ని రంగాలలో వెనుకబడిన కలకడ మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి సహకరించాలని ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని ఎంపీపీ శ్రీదేవి కోరారు. సోమవారం గుర్రంకొండ మండలం సరిమడుగు పంచాయతీలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న రాజంపేట ఎంపీతో పాటు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టవలసిన అభివృద్ధిపనులను తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరుకు కృషిచేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీపీ తెలిపారు.

కుష్టు లక్షణాలపై అవగాహన అవసరం



ఎల్‌సీడీసీ కేసులను గుర్తిస్తున్న వైద్య సిబ్బంది

నిమ్మనపల్లె : కుష్టు లక్షణాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ జులేఖా బేగం అన్నారు. సోమవారం కుష్టు కేసుల గుర్తింపు కార్యక్రమ (ఎల్‌సీడీసీ) ప్రారంభం సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26 నుంచి జూలై 16 వరకు కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించడం జరుగుతుందన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలున్నవారు వెంటనే తగిన వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. స్పర్శలేని మచ్చలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావడం, శరీరంపై నొప్పిలేని బుడిపెలు ఏర్పడటం కుష్టు లక్షణాలుగా గుర్తించాలన్నారు. మండలంలోని 12 సచివాలయాల పరిధిలో ప్రత్యేక బృందాలను ఎల్‌సీడీసీకై ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్యబృందంలో ఆశాకార్యకర్త, గ్రామ వలంటీర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పర్యవేక్షకులుగా పని చేస్తారన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు డిమాండ్



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో మూడు విద్యా సంస్థలు నడుపుతున్న నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ మాట్లాడుతూ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పలు సార్లు అధికారులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ విద్యార్థుల నుంచి దోపిడీ చేస్తున్నారన్నారు. టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ, జెఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ తదితర కోచింగ్‌ల పేరుతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రింట్ చేసిన పాఠ్యపుస్తకాలు కాకుండా కార్పొరేట్ కళాశాలలో సొంతంగా పబ్లికేషన్స్ ఏర్పాటు చేసుకుని రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఫీజుల దోపిడీ అరికట్టేందుకు ఫీజు రెగ్యులేషన్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. విద్యాశాఖాధికారులు వెంటనే పట్టణంలోని కళాశాలల్లో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఓబులేసు, గంగా, బాలకృష్ణ, సంతోష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వచ్చిన అర్జీలలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించినవి 85 వరకు వచ్చాయి. మిగిలిన వాటిలో సర్వే, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, హౌసింగ్, విద్యుత్, వైద్యశాఖకు సంబంధించినవి ఉన్నాయి. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సదరం క్యాంప్‌లో సర్టిఫికేట్‌కు సంబంధించి సయ్యద్‌సలీమా ఫిర్యాదు చేసింది. ఎన్టీఆర్ సర్కిల్‌లో రెడ్డెప్ప అనే వ్యక్తి ఇరువైపులా చెత్తవేసి ఇబ్బందులు పెడుతున్నారని, బీకే.పల్లె వైఎస్సార్ కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని, వైఎస్సార్ కాలనీ జెండాగుట్టలో సౌకర్యాలు లేవని స్థానికులు అర్జీలు సమర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మాట్లాడుతున్న ఎంఈఓ నారాయణ

నిమ్మనపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ నారాయణ అన్నారు. సోమవారం నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్‌లో తల్లిదండ్రులకు హెచ్ఎం అంజద్అలీఖాన్‌తో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన, నూతనంగా అమలు చేస్తోందన్నారు. అంతేకాకుండా అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక తదితర పథకాలతో పేద విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికసౌకర్యాలు పెంపొందాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు అవగాహనతో బలోపేతం చేయాలన్నారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో నాడు–నేడు పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా నాడు–నేడు పనులు వేగంగా పూర్తిచేసేలా సంబంధిత పాఠశాల హెచ్ఎంలు చొరవ చూపాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్య ఏఈ నాగభూషణం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో పోలీసుల విచారణ



బ్యాంక్ ఆఫ్ బోరోడా మేనేజరును విచారిస్తున్న సీఐ సురేష్, ఎస్ఐ రహీముల్లా

కలికిరి: బ్యాంక్ ఆఫ్ బరోడాలో గత ఏడాది చోటు చేసుకున్న అక్రమాలపై ఖాతారుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కలికిరి పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంక్‌లో విధులు నిర్వహించిన ప్రధాన నిందితుడు సయ్యద్ అలీఖాన్, అతని కుటుంబ సభ్యులు ఐదుగురిని, 12 మంది బ్యాంక్ సిబ్బందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచారు. వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి ప్రధాన నిందితులను మరోసారి విచారణకుగాను బ్యాంక్‌లో రికార్డులను పరిశీలించారు. అయితే ఇటీవల బ్యాంక్‌లో విశాఖపట్నం నుంచి వచ్చిన సీబీఐ ఇన్‌స్పెక్టర్ సుమారు 15 రోజులు బ్యాంక్‌లోనే తిష్టవేసి బ్యాంక్ రికార్డులతో పాటు ప్రధాన నిందితుడు అలీఖాన్ ఖాతాకు సంబంధించిన లావాదేవీలు జరిగిన ఖాతాదారులను బ్యాంక్‌కు పిలిచి విచారించారు. దీంతో బ్యాంక్ అక్రమాల కేసు సీబీఐ విచారణలోకి వెళ్లినట్లు తేలింది. అయితే సోమవారం వాల్మీకిపురం సీఐ సురేష్, కలికిరి ఎస్ఐ రహీముల్లా, ఏఎస్ఐ మధుసూదనాచారి బ్యాంక్‌కు వెళ్లి కేసుకు సంబంధించి విచారించడంతో బ్యాంక్ మేనేజర్ రామసుబ్బారెడ్డి సీబీఐ విచారించినట్లు చెప్పారు. అలాగే పోలీసులు అడిగిన వివరాలను ఇచ్చారు. ఒకే కేసును ఇటు పోలీసులు, అటు సీబీఐ విచారిస్తుండటం గమనార్హం.

అర్హులను గుర్తించండానికే 'జగనన్న సురక్ష'



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ భానుప్రసాద్

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా ఎవరైనా అర్హులుగా మిగిలి ఉంటే వారిని గుర్తించి న్యాయం చేయడం కోసం జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని సీటీఎం, పొన్నూటిపాళ్యం పంచాయతీలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను డీఎల్‌డీఓ, ఎంపీడీఓ పరిశీలించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ఇంటింటికీ తిరిగి నిష్పక్షపాతంగా 10 0శాతం సర్వే పూర్తి చేయాలని సూచనలు జారీచేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంకు సంబంధించి ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..
బి.కొత్తకోట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బి.కొత్తకోట నగర పంచాయతీలో సోమవారం ప్రారంభించారు. సచివాలయం–2లో సింహం వీధి, పాళం వీధి, హరి మందిరం వీధి, మెయిన్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందించడం జరుగుతుందని మేనేజర్ రమాదేవి అన్నారు. సచివాలయ స్థాయిలో ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను మంజూరు చేయడం జరుగుతందని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజల వద్దకే వెళ్లి సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటరమణ, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు తరలి వచ్చిన భక్తులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై ఉన్న శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు సోమవారం భక్తజనం తరలి వచ్చారు. ఆలయానికి రోడ్డు సౌకర్యం, ఆర్టీసీ సౌకర్యం ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు వచ్చారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున లు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలతో స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి,దర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, ఈవో రమణ, కొండకిట్టల ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు, దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం చేశారు. గౌరమ్మగుట్టలోని గౌరమ్మతల్లికి మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు



ఆర్టీసీ స్పెషల్ యాత్రలపై ప్రచారం చేస్తున్న మార్కెటింగ్ టీమ్

పీలేరు రూరల్ : జూలై 2న అరుణాచలం (తిరువణ్ణామలై)కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. సోమవారం పీలేరు పట్టణంలో మార్కెటింగ్ టీమ్ ఆధ్వర్యంలో స్పెషల్ యాత్రలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి పీలేరు నుంచి తిరువణ్ణామలైకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు మార్కెటింగ్ టీమ్ కె.వి. రమణ 7893152748, 7382878751 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

మదనపల్లె సిటీ: క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి అన్నారు. సోమవారం స్థానిక మిషన్ కాంపౌండ్ మైదానంలో వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో శాప్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చారన్నారు. సీనియర్ కోచ్‌లు విద్యార్థులకు ఆటల్లో మెలకువలు నేర్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు ఫుట్‌బాల్ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షేక్ షఫీ, కౌన్సిలర్లు రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్లూరు రఫీ, పీడీలు కమలేష్, అబ్దుల్లా, అంజి తదితరులు పాల్గొన్నారు.